VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మంగళవారం 10 మార్చి 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 208



ఎనిమిదేళ్ల యుద్ధానికైనా సిద్ధం

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



2లో..

## అత్యున్నతంగా యంగ్ ఇండియా

# స్పోర్ట్స్ యూనివర్సిటీ

- ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు
- ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ
- క్రీడాశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

గచ్చిబౌలి ఔట్ డోర్ స్టేడియంను పునరుద్ధరించడం తో పాటు, స్టేడియం ఆవరణలో ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ కాంప్లెక్స్, హాస్టల్ భవనాలు, అన్ని రకాల క్రీడా మైదానాలు, శిక్షణకు అవసరమైన ఇతర సౌకర్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా నిర్మాణాలకు సంబంధించి పలు డిజైన్లను పరిశీలించారు.

## వ్యవసాయ రుణాలు కింద మొత్తం

# రూ.31,34,807



లోక్‌సభలో కేంద్రమంత్రి వెల్లడి

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా రైతులకు వ్యవసాయ రుణాలు కింద మొత్తం రూ.31,34,807 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. సోమవారం లోక్‌సభలో డీఎంకే సభ్యుడు రాజు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. పంట రుణాలు కింద రూ.16,34,219 కోట్లు.. టర్మ్ లోన్స్ కింద రూ.15,00,588 కోట్లు ఉన్నట్లు తెలిపారు. అలాగే పలు రాష్ట్రాల్రైతుల అప్పుల భారాన్ని ఈ సందర్భంగా గణాంకాలతో

సహా వెల్లడించారు. ఈ జాబితాలో తమిళనాడు అగ్రస్థానంలో నిలవగా.. తెలుగు రాష్ట్రాలు ఏపీ రెండు, తెలంగాణ ఏడో స్థానాల్లో ఉన్నాయి.

## వెలుగుమట్ల బాధితులతో

# కవిత ధర్నా

- ఖమ్మం జడ్పీ కూడలిలో ఆందోళన
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- కవితను అరెస్ట్ చేసిన పోలీసులు



2లో..



2లో..

# ప్రజాసేవలో ఎప్పుడూ పోలీసులే ముందు

- సాయం కోసం ప్రజలు పోలీసుల వైపే చూస్తారు
- ప్రజలకు మీరున్నారనే ధైర్యం ఇందుకు కారణం
- నేరాల తీరు మారి..సైబర్ క్రైమ్ పెరిగింది
- నేరాల తీరుకు అనుగుణంగా పనితీరు మార్చుకోవాలి
- పోలీస్ ఆఫీసర్స్ రీట్రీట్‌లో సిఎం రేవంత్ రెడ్డి

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమిగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని అన్నారు. దేశంలో ఢిల్లీ అత్యంత కాలుష్య నగరంగా మారింది. ట్రాఫిక్ సమస్యలతో బెంగుళూరు నగరంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముంబై, చెన్నై నగరాలు వరదలతో సతమతమవుతున్నాయి.

## ఎన్టీపీసీతో విద్యుత్ కొనుగోలు

# ఒప్పందం చేసుకోవాలి

హైదరాబాద్: ఎన్టీపీసీ రామగుండంలో ఏర్పాటుచేయనున్న థర్మల్ ప్లాంటులో ఉత్పత్తయ్యే కరెంటు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం(పీపీఏ) చేసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. "రామగుండంలో ఎన్టీపీసీ ఏర్పాటు చేయాల్సిన 4,000 మెగావాట్ల థర్మల్ ప్లాంటు మొదటి దశలో భాగంగా నిర్మించిన 1,600 మెగావాట్ల ప్రాజెక్టును ప్రధాని మోదీ 2023లో ప్రారంభించారు. రెండో దశలో 2,400 మె.వా సామర్థ్యంతో మిగిలిన 3 యూనిట్లను పూర్తి చేయడానికి ఎన్టీపీసీ చర్యలు చేపట్టింది. రెండోదశలో ఉత్పత్తి చేసే విద్యుత్‌లో 85% తెలంగాణకే సరఫరా చేయనుంది. ఈనెల 3న రాష్ట్రంలో అత్యధిక విద్యుత్ డిమాండ్ నమోదైంది. ముున్ముందు ఇది మరింత పెరగనుంది. తదనుగుణంగా ఉత్పత్తి వనరులను సమకూర్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టినట్లు తెలిసింది. 2,400 మెగావాట్ల థర్మల్ ప్లాంటు ఏర్పాటుకు రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం కూడా తీసుకున్నట్లు తెలిసింది. అతి తక్కువ ఖర్చుతో, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో థర్మల్ ప్లాంటు ఏర్పాటు చేయడంలో ఎన్టీపీసీకి విశేష అనుభవం ఉంది. అయితే, ఈ ప్రాజెక్టులకు అవసరమైన బొగ్గును సమీకరించుకోవడంలో ఎన్టీపీసీకి రాష్ట్ర ప్రభుత్వం తగిన స్వేచ్ఛను ఇస్తే.. నాణ్యమైన విద్యుత్‌ను చౌకగా ఉత్పత్తి చేసి, రాష్ట్ర అవసరాలను తీర్చడానికి సిద్ధంగా ఉంది. ఈ విషయంలో సీఎం



వ్యక్తిగతంగా చొరవ తీసుకోవాలి" అని కిషన్‌రెడ్డి లేఖలో కోరారు. ప్రధాని మోదీ దార్శనిక నాయకత్వంలో కాకతీయ వైభవానికి మరో అరుదైన గుర్తింపు లభించిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కొనియాడారు. ములుగు జిల్లా పాలంపేటలోని శివాలయం, గొల్లాలగుళ్లను భారత పురావస్తు శాఖ 'జాతీయ ప్రాముఖ్యం కలిగిన స్మారక చిహ్నాలు'గా ప్రకటించిందని సోమవారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

# మూసీ అభివృద్ధిని అడ్డుకోవడం తగదు



- చెరువుల పునరుద్ధరణ కొనసాగుతుంది
- నిర్వాసితులకు డబుల్ ఇళ్లు ఇస్తాం
- కూకట్‌పల్లి నల్ల చెరువును ప్రారంభం
- చెరువుకు హారతి ఇచ్చిన సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: మూసీ అభివృద్ధిని అడ్డుకోవడమంటే. .తెలంగాణ పురోగతిని అడ్డుకోవడమే అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నిర్వాసితుల్లో అర్హులైన పేదలు ఉంటే వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తాం. పేదవాడి ఇల్లు కూల్చడం ప్రభుత్వ ఉద్దేశం కాదన్నారు. వరదల వల్ల ఇళ్లు మునిగిపోతే కుటుంబం మొత్తం నష్టపోతుంది. వరద ముప్పును తప్పించాలంటే చెరువులను పునరుద్ధరించాలి. మూసీని పునరుద్ధరించకుంటే భవిష్యత్ తరాలు మనల్ని క్షమించవని అన్నారు.. భాజపా ప్రభుత్వాలు గంగా, సబర్మతి, సరయూ నదుల అభివృద్ధిని చేపట్టలేదా? మూసీ అభివృద్ధిని మాత్రం ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. మూసీ పునరుద్ధరణను వ్యతిరేకించడమంటే రాష్ట్రానికి అన్యాయం చేయడమేనని, దీనివల్ల ఎవరికైనా నష్టం జరిగితే మంచి పరిహారం ఇచ్చి ఆదుకుంటాం అని రేవంత్‌రెడ్డి తెలిపారు. కూకట్‌పల్లి నల్ల చెరువు అభివృద్ధి చూస్తే ఆనందంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైడ్రా పునరుద్ధరించిన కూకట్‌పల్లి నల్ల చెరువును ప్రారంభించి ఆయన మాట్లాడారు. సీఎంగా మీ ముందుకు రావడం ఆనందంగా ఉంది. ఆనాడు ఎంపీగా కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని ఉన్నా నిధులు లేక చేయలేకపోయా. ఇప్పుడు అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఇస్తాను. చెరువుల పునరుద్ధరణ వల్ల పేదలకు నష్టం కలిగి ఉండవచ్చు. గతంలో తాను మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న సమయంలో నిధులు లేక ఈ నల్లచెరువును అభివృద్ధి చేయలేక పోయినట్లు రేవంత్ రెడ్డి వెల్లడించారు. కూకట్‌పల్లిలో ప్రస్తుతం నల్లచెరువు అభివృద్ధిని చూసి స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.

# అమెరికా, ఇజ్రాయెల్‌తో మోదీ రాజీపడ్డారు

- కుట్ర బయటపడుతుందనే వెనుకడుగు
- దేశ ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది
- సంక్షోభంతో చమురు ధరల పెరుగే అవకాశం
- కేంద్రంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- పశ్చిమాసియా సంక్షోభంపై చర్చకు డిమాండ్

న్యూఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. పశ్చిమాసియా సంక్షోభం గురించి పార్లమెంట్‌లో చర్చించడానికి కేంద్ర ప్రభుత్వం ఇష్టపడటం లేదని ఆరోపించారు. పశ్చిమాసియా సంక్షోభం గురించి పార్లమెంట్‌లో చర్చ జరిగితే ప్రధాని మోదీ అమెరికా, ఇజ్రాయెల్‌కు ఎలా రాజీ పడ్డారో బయటపడుతుందని అన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితులు దేశ ప్రజలపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని తెలిపారు. అలాగే అక్కడి సంక్షోభం చమురు ధరల పెరుగుదలకు దారితీయవచ్చని అభిప్రాయపడ్డారు. "పశ్చిమాసియా సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద



నష్టాన్ని కలిగిస్తుంది. స్టాక్ మార్కెట్లలో ఏం జరుగుతుందో మీరు చూశారు. ప్రధాని మోదీ అమెరికా ట్రేడ్ డీల్‌పై సంతకం చేశారు. దీంతో దేశం దెబ్బ తినబోతోంది. అలాగే పశ్చిమాసియా సంక్షోభం గురించి చర్చించడంలో వారికి ఏ సమస్య ఉంది? ఆ తర్వాత మనం ఇతర అంశాలపై చర్చ జరపవచ్చు. పశ్చిమాసియా మన దేశానికి ముఖ్యం కాదా? ఇంధన ధరలు, ఆర్థిక విధ్వంసం మనకు ముఖ్యమైన చర్చనీయాంశాలు కావా? అవే మనకు ప్రజా సమస్యలు" అని రాహుల్ గాంధీ అన్నారు. పశ్చిమాసియా సంక్షోభాన్ని తాము ముఖ్యమైనదిగా భావిస్తున్నామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అందుకే ఆ అంశంపై చర్చను కోరుతున్నామని అన్నారు. "కానీ కేంద్ర సర్కార్ పశ్చిమాసియా సంక్షోభం గురించి చర్చ జరిపేందుకు ఇష్టపడడం లేదు. ఎందుకంటే ఆ అంశంపై చర్చ జరిపితే ఇతర విషయాలు బయటకు వస్తాయి. ప్రధాని మోదీ

వైఖరి బయటపడుతుంది. మోదీ ఎలా రాజీ పడ్డారు? ఆయనను ఎలా బ్లాక్ మెయిల్ చేస్తున్నారు? వంటి విషయాలు తెలుస్తాయి. అందుకే పార్లమెంట్‌లో పశ్చిమాసియా సంక్షోభంపై చర్చకు కేంద్రం ఇష్టపడడం లేదు. చర్చకు డిమాండ్ చేస్తున్న సమయంలో ప్రధాని మోదీ పార్లమెంట్ నుంచి ఎలా పారిపోయారో మీరు చూశారు. ఒకవేళ పశ్చిమాసియా సంక్షోభంపై చర్చ జరిగితే ప్రధాని మోదీ పార్లమెంట్‌కు రాలేరు" అని రాహుల్ వ్యాఖ్యానించారు. అలాగే వీబీ జీ రామ్ జీ అమలు నేపథ్యంలో కేంద్ర సర్కార్‌పై కాంగ్రెస్ మండిపడింది. ఈ పథకం వివరాలు ఇంకా రూపొందుతున్నాయని, ఇది మోదీ ప్రభుత్వ వేగవంతమైన విధానానికి సరైన ఉదాహరణ అని పేర్కొంది. 'మొదట ప్రకటించండి, తరువాత ఆలోచించండి' అనే విధానాన్ని కేంద్రం అనుసరిస్తోందని మండిపడింది.

వేగుచుక్క

# శ్రీవారికి అపచారం చేస్తే ఊరుకునేది లేదు



సీఎం అన్నారు. గత ఐదేళ్లు దుర్మార్గ పాలన సాగిందని సీఎం విమర్శించారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీవారి ప్రసాదాన్ని కూడా కల్తీ చేశారని సీఎం ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం తిరుమల పవిత్రతను దెబ్బతీసే ప్రయత్నం చేసిందని విమర్శించారు. సీబీఐ రిపోర్ట్ ఇచ్చినా లడ్డూ కల్తీపై తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తిరుమలపై దృష్టి పెట్టానని సీఎం తెలిపారు. కల్తీ మద్యంతో చాలా మంది చనిపోయేలా చేశారని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. హంద్రీనీవాతో తాగునీరు, కుప్పానికి కూడా నీళ్లు ఇచ్చామని చెప్పారు. రాయలసీమలో ప్రతి ఎకరానికి నీళ్లు ఇవ్వాలనేది తన సంకల్పమని పేర్కొన్నారు. మాజీ మంత్రి వివేకాను దారుణంగా చంపారని.. నాన్న లేరు చిన్నాన్న కూడా లేరంటూ డ్రామాలు ఆడారని సీఎం విమర్శించారు. నారాసుర రక్తచరిత్ర అంటూ తన చేతిలో కత్తి పెట్టారని ఆరోపించారు. జగన్ మాటలు నమ్మి 2019లో తనకు ఓటు వేయలేదని చెప్పారు. తప్పును కప్పిపుచ్చుకోవడానికి ఎదురుదాడి చేస్తున్నారని ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేశారు.

డబ్బు మీద ఆశతో ఒక్కరి కంటే ఎక్కువ మందిని కనడం లేదని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పుడు ఇద్దరి కంటే ఎక్కువ మందిని కనాల్సిన అవసరం వచ్చిందని తెలిపారు. పెద్ద కుటుంబానికి ఎక్కువ సహాయం చేసేలా పథకాలు తీసుకొస్తామన్నారు. రైతే రాజు కావాలని.. రైతు అప్పులపాలు కావడానికి వీల్లేదన్నారు. దీపం పథకం ద్వారా మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని అన్నారు. గత పాలనకు ఈ పాలనకు తేడా ఏంటో ప్రజలే గమనించాలన్నారు. ఇప్పుడు రాష్ట్రానికి పెట్టుబడులు పెద్ద ఎత్తున వస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్కొన్నారు. కాగా.. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హార్టికల్చర్ పంటల ఉత్పత్తుల స్టాళ్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఫ్రూట్ కవర్ల వాడకం వల్ల పండ్లకు మంచి ధర లభిస్తుందని హార్టికల్చర్ అధికారులు తెలిపారు. దీనిపై రైతులకు మరింత అవగాహన కల్పించాలని సీఎం అధికారులకు ఆదేశించారు. కవర్ తొడిగిన పండ్ల నాణ్యతను, కవర్ లేని పండ్ల నాణ్యతను సీఎం స్వయంగా పరిశీలించారు. జిల్లాలో మంచి రేట్లు రావడానికి వివిధ వెరైటీల పంటలను

ప్రోత్సహించాలని సూచించారు. భూగర్భ జలాల స్థాయిలు పెరిగేలా నీటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

# వెలుగుమట్ల బాధితులతో కవిత ధర్నా



ఖమ్మం: ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులకు న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవనంలో వెలుగుమట్ల బాధితులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటివరకూ బాధితులకు ప్రభుత్వం అండగా లేదని విమర్శించారు. ప్రభుత్వం తరఫున వారికి వైద్య సహాయం కూడా అందలేదన్నారు. అనంతరం ఖమ్మం జడ్పీ కూడలిలో కవిత ఆందోళనకు దిగారు. వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలంటూ ధర్నా నిర్వహించారు. బాధితులతో కలిసి జడ్పీ కూడలిలో రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని సర్ది చెప్పడంతో ఆమె నిరసనను విరమించుకున్నారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాలోని జడ్పీ సెంటర్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెలుగుమట్ల భూదాన్ యజ్ఞ బోర్డు భూముల నిర్వాసితులతో కలిసి ఆందోళనకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత దిగారు. ఈ క్రమంలో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. కవితతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్ విశారదన్, పలువురు ఆందోళనకారులను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఖమ్మం నగరంలో వెలుగుమట్ల ప్రాంతానికి చెందిన భూదాన్ యజ్ఞ బోర్డు భూముల నిర్వాసితులతో కలిసి కవిత సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అంబేద్కర్ సెంటర్ వరకు కొనసాగింది. అక్కడికి చేరుకున్న అనంతరం కవిత అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ ర్యాలీ అనంతరం నిర్వాసితులు ఖమ్మం జడ్పీ సెంటర్ వద్ద ఆందోళనకు దిగారు. తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వారు నిరసన వ్యక్తం చేశారు. ఆందోళనలో భాగంగా కొంతమంది నిర్వాసితులు రాస్తారోకో నిర్వహించి వాహనాలను అడ్డుకున్నారు. దీంతో జడ్పీ సెంటర్ పరిసరాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీగా మోహరించారు. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ చైర్మన్ విశారదన్‌తో పాటు పలువురు నిర్వాసితులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం కవితను నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆందోళనల నేపథ్యంలో ఖమ్మం జడ్పీ సెంటర్ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టారు.

# అత్యున్నతంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ



హైదరాబాద్: అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. వర్సిటీ నిర్మాణాలకు సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించారు. దీనికి సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని సదుపాయాలతో స్పోర్ట్స్ వర్సిటీ నిర్మాణాలు ఉండాలి. ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటేలా చర్యలు తీసుకోవాలి. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియాన్ని ఆధునికీకరించాలి. అదేవిధంగా గచ్చిబౌలి ఔట్‌డోర్ స్టేడియాన్ని పునరుద్ధరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్రీడాశాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పనపై అధికారులతో చర్చించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పన, అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటుపై చర్చించారు. ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా రాష్ట్రంలో అన్ని సౌకర్యాలతోపాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణాలు ఉండాలని సీఎం అన్నారు. గచ్చిబౌలి ఔట్ డోర్ స్టేడియంను పునరుద్ధరించడం తో పాటు, స్టేడియం ఆవరణలో ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ కాంప్లెక్స్, హాస్టల్ భవనాలు, అన్ని రకాల క్రీడా మైదానాలు, శిక్షణకు అవసరమైన ఇతర సౌకర్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా నిర్మాణాలకు సంబంధించి పలు డిజైన్లను పరిశీలించారు. డిజైన్లకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేసారు. ఒలంపిక్స్, కామన్ వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా, ఒలంపిక్స్ లో తెలంగాణ క్రీడాకారుల సత్తా చాటడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నగరంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, ఎల్బీ స్టేడియం, సరూర్ నగర్ స్టేడియంలను భవిష్యత్ అవసరాలు, శిక్షణ, పోటీలకు అనుగుణంగా ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేంనరేందర్ రెడ్డి, శాప్ చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శ్రీనివాస రాజు, శేషాద్రి, ఎండీ సోనీ బాలదేవి, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి. కిషోర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎఐ మీద కాదు ప్రజారోగ్యం మీద దృష్టి పెట్టండి

**పాలకల్తీ బాధితులను ఆస్పత్రిలో పరామర్శించిన షర్మిల**

అమరావతి: కల్తీ పాలు తాగిన ఘటనలో చికిత్స పొందుతున్న బాధితులను సోమవారం రాజమండ్రి ఆసుపత్రిలో ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యం గురించి తెలుసుకొని, బాధిత కుటుంబాలను ఓదర్చారు. ఈ ఘటనలో 11 మంది మరణించగా, ఇంకా 9 మంది ప్రాణాలతో కొట్టుమిట్టాడటం చూస్తే, రాష్ట్రంలో కనీసం స్వచ్ఛమైన పాలు కూడా అందించడంలో నిఘా పెట్టలేని ప్రభుత్వం ఉంటే ఎంత ఊడితే ఎంత అంటూ మండిపడ్డారు. ఏఐ మీద పెట్టే శ్రద్ధలో పావు వంతైనా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజారోగ్యం మీద పెట్టాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. జనాభా కనమని చెప్పడం కాదు. ఉన్న వాళ్లకు ప్రజారోగ్యంపై భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాజమండ్రి కల్తీ పాల ఘటనలో సంభవించిన 11 మరణాలు ప్రభుత్వం చేసిన హత్యలేనని ఆరోపించారు. చనిపోయిన కుటుంబాలకు 25 లక్షల పరిహారం ఇవ్వాలని, చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆమె డిమాండ్ చేవారు. రాష్ట్రంలో పాలు కల్తీ, నెయ్యి కల్తీ, మద్యం కల్తీ, వాగ్దానాలు కల్తీ. మొత్తం పాలనే కల్తీ అని విమర్శించారు. 11 ఏళ్లుగా లైసెన్స్ లేకుండా వరలక్ష్మి డైరీ నడుస్తుంటే చర్యలేవి ? తనిఖీలు ఎక్కడ ? అంటూ ప్రశ్నించారు. ఈ ఘటన యాదృచ్ఛికం కాదు .. పూర్తి నిర్లక్ష్యమని అన్నారు. సైతాన్ సైన్యానికి ఆపద వస్తే తప్పా జగన్ మోహన్ రెడ్డి సైతం బయటకు రారని ఆరోపించారు.

# పెన్షనర్స్ భవన్‌లో... అంతర్జాతీయ మహిళా దినోత్సవం.





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

పెన్షనర్స్ భవన్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షురాలు దీన సుజనా అధ్యక్షతన సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర మేయర్ కూరగాయల ఉమారాణి ప్రసంగించారు. మహిళలు అన్ని రంగాలలో రాణించాలని, అలాగే మహిళల పై జరిగే దౌర్జన్యాలను అరికట్టాలని, నగర అభివృద్ధికి నిరంతరం పాటుపడతానని అన్నారు.తర్వాత వెల్నెస్ హాస్పిటల్ ప్రముఖ గైనకాలజిస్ట్ మమతారెడ్డి మాట్లాడుతూ, మహిళలు సాధారణం గా ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు వివరించి వాటికి తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియచేశారు.తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్, లింగా అరుణ ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చి ప్రస్తుతం ప్రభుత్వ విధానాలు పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు అదేవిధంగా మహిళలపై జరుగుతున్న దాడులు పోరాడి సాధించుకున్న మహిళల హక్కులకు ప్రస్తుత ప్రభుత్వాల వల్ల వస్తున్న ప్రమాదాలు ని వివరించడం జరిగింది. ఈ సమావేశంలో వెల్నెస్ సెంటర్ డాక్టర్ కృష్ణవేణి, అర్బన్ హెల్త్ సెంటర్ అర్సపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చంద్రకళ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రారంభంలో జరిగిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతుల్ని అలరించాయి. అలాగే సిర్ప లింగన్న తన పాటలతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. కార్యక్రమం చివరలో వివిధ రంగాలలో నిష్ణాతులైన మహిళా మణులకు సన్మానాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సిర్ప హనుమండ్లు, జనరల్ సెక్రటరీ ఈవీఎల్ నారాయణ, ప్రసాదరావు, బాల దుర్గయ్య, సాగర్, బాలస్వామి, పుష్పవల్లి, టి వి లలిత మేరీ జార్జ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవలో ఎప్పుడూ పోలీసులే ముందు

హైదరాబాద్:ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి పోలీస్ అధికారులు చేస్తున్న కృషిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. మనం ఎక్కడున్నామోతెలిసుకోగలిగితే మనం ఎక్కడికి చేరుకోవాలో తెలుస్తుందన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్-2026 కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ రిట్రీట్ కార్యక్రమం ద్వారా సమస్యలు, పరిష్కారాలపై విశ్లేషించుకున్నట్లు సిఎం తెలిపారు. ఛాలెంజ్ లు రెండు రకాలు.. ఒకటి టెక్నికల్ ఛాలెంజ్, రెండోది అడాప్టివ్ఛాలెంజ్ అన్నారు. రిసోర్సెస్, సమయాన్ని కేటాయిస్తే టెక్నికల్ ఛాలెంజ్ ను అధిగమించవచ్చన్నారు. కానీ అడాప్టివ్ఛాలెంజ్ విషయంలో ఎదురైన సమస్య లోతును అర్థంచేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే శాంతిభద్రతలు అదుపులో ఉండాలన్నారు. రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ ఉండకూడదనే తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ డాక్యుమెంట్ ను ఆవిష్కరించుకున్నామని తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించడానికి ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న 2100కి.మీ ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్ గా పరిగణించుకుంటున్నాం అని అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమిగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని అన్నారు. దేశంలో ఢిల్లీ అత్యంత కాలుష్య నగరంగా మారింది. ట్రాఫిక్ సమస్యలతో బెంగుళూరు నగరంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముంబై, చెన్నై నగరాలు వరదలతో సతమతమవుతున్నాయి. అలాంటి మెట్రోపాలిటన్ నగరాల నుంచి మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏ సమస్య వచ్చినా ప్రజలు మొట్టమొదట సహాయం కోసం ఎదురు చూసేది పోలీసుల కోసమేనని అన్నారు. ఒకప్పుడు తీవ్రవాదం ఒక సమస్యగా ఉండేది.. ఇందుకోసం ఆక్టోపస్, గ్రేహౌండ్స్ లాంటి వ్యవస్థలు తీసుకొచ్చారు. అవినీతిని నిరోధించేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఫిజికల్ క్రైమ్ నిరోధించేందుకు ఇప్పటి వరకు వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాం. కానీ ఇప్పుడు నేర స్వరూపమే మారిపోయింది. సైబర్ క్రైమ్ పెరిగిపోతున్న ఈ రోజుల్లో మన సిస్టం ను అప్ గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక నైపుణ్యం ఉన్న అధికారులను నియమించుకోవాల్సిన అవసరం ఉంది. ఉన్న సిబ్బంది, అధికారులను అప్ గ్రేడ్ చేసుకోకపోతే నేరాలను నిరోధించలేమని గుర్తు చేశారు.రిట్రీట్ కార్యక్రమం ద్వారా మీ సమస్యలను గుర్తించి విశ్లేషించుకున్నారు. సమస్య ఏమిటో గుర్తిస్తే 50 శాతం సమస్య పరిష్కారం అయినట్లే. సైబర్ క్రైమ్, నార్కోటిక్స్, రిక్రూట్ మెంట్, ఇతర అంశాలకు సంబంధించి వివిధ సమస్యల పరిష్కారానికి మీరు కొన్ని ప్రతిపాదనలు అందించారు. సమస్యల పరిష్కారానికి మీరు అందించిన ప్రతిపాదనలపై విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక అధికారుల కమిటీ ఏర్పాటు చేస్తాం.. మీ ప్రతిపాదనలపై కమిటీలో విశ్లేషించి చట్టం రూపంలో మా ముందుకు తీసుకురండి. సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రభుత్వం దానిపై నిర్ణయం తీసుకుంటుంది. పోలీస్ శాఖలో సిబ్బంది రేషనలైజేషన్ చేసుకుని జనాభా ప్రాతిపదికన పోలిసింగ్ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలి. పోలీస్ శాఖలోని వివిధ విభాగాల మధ్య సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలి. పోలీస్ శాఖలో ఉద్యోగులు ఆటో మోడ్ కు వెళితే సమాజానికి అత్యంత ప్రమాదకరం. ఇతర శాఖల్లా పోలీస్ శాఖలో ఆటో మోడ్.. ఆటో ప్రమోషన్ ఉండదు. పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు అప్ గ్రేడ్ అవ్వాల్సిందేనని అన్నారు.అవసరమైన నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంది. మీ పనితీరు ఆధారంగానే పోస్టింగులు ఉంటాయి. ప్రతీ ఏటా డిసెంబరులో రిట్రీట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసునేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

# తెలంగాణ నుంచి ఇద్దరు రాజ్యసభకు ఏకగ్రీవం

హైదరాబాద్: తెలంగాణ నుంచి నామినేషన్ దాఖలు చేసిన ఇద్దరు అభ్యర్థులు రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డి సోమవారం ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున వేం నరేంద్ర రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీలు రాజ్యసభకు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. అందుకు సంబంధించిన పత్రాలను వీరికి అందజేసినట్లు తెలిపారు. అభిషేక్ మను సింఘ్వీ తరఫున అడ్వకేట్ సుందర్ చౌహాన్ అందుకున్నారు. వేం నరేందర్ రెడ్డి అసెంబ్లీ కార్యాలయానికి వచ్చి ధృవీకరణ పత్రం స్వీకరించారు. రాజ్యసభలో పలువురి సభ్యుల పదవి కాలం ఏప్రిల్‌లో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఇటీవల కేంద్ర ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. గురువారంతో నామినేషన్ల ప్రకియ ముగిసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ తరఫున తెలంగాణ నుంచి అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. తెలంగాణ అసెంబ్లీలో ఏర్పాటు చేసిన రాజ్యసభ ఎన్నికల కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డికి వీరు తమ నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఇక.. సాయి అనే వ్యక్తి సైతం ఈ రాజ్యసభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అతడి అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకపోవడంతో.. శుక్రవారం ఆ నామినేషన్‌ను తిరస్కరించారు. అలాగే ఇతరులు ఎవ్వరూ నామినేషన్ల దాఖలు చేయలేదు. దీంతో కాంగ్రెస్ నుంచి నామినేషన్ల దాఖలు చేసిన అభిషేక్, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక ఏకగ్రీవమైంది.

# సిలిండర్ బుకింగ్‌లో కీలక మార్పులు

న్యూఢిల్లీ: దేశీయ గ్యాస్ సిలిండర్ల బుకింగ్‌కు సంబంధించి నిబంధనల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ఒక సిలెండర్ డెలివరీ తర్వాత మరొక సిలిండర్ బుక్ చేయడడానికి కనీస గడువును 21 రోజుల నుంచి 25 రోజులకు కేంద్రం పెంచినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సిలిండర్లు నిల్వచేసుకోవడం, బ్లాక్ మార్కెటింగ్‌ను నిరోధించేందుకు కేంద్రం తాజా నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం వలన కలిగే ఇంధన సరఫరా అంతరాయాలను అధిగమించేందుకు కేంద్రం తాజా చర్యలు చేపట్టింది. చమురు రి÷నైరీలకు ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచాలని, వాణిజ్య అవరసరాల కంటే గృహ అవసరాలకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించించి. ÷ూగా, ఇంతకుముందు 55 రోజులకు సిలిండర్లు బుకింగ్ చేసుకునే వారు ఇప్పుడు 15 రోజుల్లోనే సిలెండర్లు బుక్ చేసుకుంటున్న సందర్భాలు చోటుచేసుకుంటున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కేంద్రం సైతం ఎల్జీపీ భాగస్వాముల కోసం ప్రయత్నాలు చేస్తోందని,

అల్జీరియా, ఆస్ట్రేలియా, కెనడా, నార్వే దేశాలు ఇండియాకు ఎల్పీజీ అమ్మేందుకు సంప్రదింపులు సాగిస్తున్నాయని ఆ వర్గాలు చెప్పాయి. క్రూడాయిల్ బ్యారెల్ ధర 130 డాలర్లు దాటనంత వరకూ పెట్రోల్, డీజిల్ ధరలు పెరగకపోవచ్చని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

# సొంత చెల్లెల్కకు న్యాయం చేయలేని వ్యక్తి

**ఆడవాళ్ల గురించి మాట్లాడితే విడ్డూరంగా ఉంది జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి సవిత**

శ్రీసత్యసాయి: సొంత తల్లి, చెల్లికి, చిన్నాన్న కుమార్తెకు న్యాయం చేయని వ్యక్తి వైఎస్ జగన్ అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అభివర్ణించారు. ఇంట్లో వారిని బజారు పాలు చేశారంటూ జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై మంత్రి సవిత మరోసారి నిప్పులు చెరిగారు. సోమవారం శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి సవిత మాట్లాడుతూ.. వైఎస్ జగన్ మహిళల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిండు అసెంబ్లీలో తల్లి లాంటి నారా భువనేశ్వరిని అవమానించారంటూ మండిపడ్డారు. తాడేపల్లి, పులివెందులలో మహిళలపై జరిగిన అత్యాచారాలు, దారుణాలు అంతా చూశారన్నారు. మహిళా ద్రోహి సీఎం చంద్రబాబు అంటూ జగన్ మాట్లాడడం దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రశ్నిస్తే మహిళలపై కూడా కేసులు పెట్టారంటూ సీఎంగా జగన్ వ్యవహరించిన తీరును ఈ సందర్భంగా మంత్రి సవిత తూర్పారబట్టారు. హిందువులు, మహిళలు, బీసీల అభివృద్ధి అంటే సరిపోదంటూ జగన్‌కు చురకలంటించారు. మీ హయాంలో జరిగిన అరాచకాలపై నివేదిక తయారు చేసి గవర్నర్‌కు ఇప్పటికే అందజేశామన్నారు. ÷ాయలసీమ సాగునీటి గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నేతలకు లేదని కుండ బద్దలు కొట్టారు. వారు రాయలసీమ ద్రోహులున్నారు. ఏ రోజు ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదంటూ వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డైవర్షన్ పాలిటిక్స్ కోసం వైసీపీ నాయకులు సభలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. అయితే ప్రజలు, మహిళలు చాలా క్లారిటీగా ఉన్నారు. మహిళా సాధికారత గురించి ఆలోచించింది పూలే ఆ తర్వాత డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ అని మంత్రి సబితా తెలిపారు. ప్పుడు ఎన్టీఆర్ తర్వాత చంద్రబాబు మాత్రమే మహిళా సాధికారత కోసం పని చేస్తున్నారని స్పష్టం చేశారు. మహిళలకు అన్ని అంశాల్లో ప్రాధాన్యత కల్పించింది సీఎం చంద్రబాబేనని పేర్కొన్నారు. ప్రతి ఇంటా మహిళా ఎంటర్ ప్రెన్యూర్ రావాలన్నదే చంద్రబాబు లక్ష్యమని స్పష్టం చేశారు.ం

# ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్‌గా సంతోష్


హైదరాబాద్:గిరిజన సంక్షేమశాఖ నూతన సంచాలకులుగా సంతోష్ బి.ఎం బాధ్యతలు సవీకరించారు. హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో సోమవారం సంతోష్ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ గా బాధ్యతలు చేపట్టారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా విభాగాల అధికారులు, సిబ్బందితో వారి వారి విధులు, పనులను గూర్చి సమీక్ష చేశారు. చేయవలసిన పనులను గూర్చి తనకు విభాగాల వారీగా తెలియజేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ-ఫైల్స్ పెట్టడం కూడా ప్రారంభించాలన్నారు. విభాగాలవారీగా అధికారులు తమ విధులు, బాధ్యతల గురించి తనకు వివరాలు ఇవ్వాలని, ఆ మేరకు పనులు చేసుకుంటూ వెళ్తామని అన్నారు.

గిరిజన సంక్షేమ పథకాలు అన్ని కూడా అడవులలో చివరి మజిలీలో ఉన్న చివరి గిరిజనులకు కూడా చేరేటట్లు ప్రణాళికలు రచించాలని, ప్రత్యేకించి గిరిజనుల ఆరోగ్యం, విద్యావకాశాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గిరిజన సంక్షేమం మీద పూర్తి అవగాహన ఏర్పరచుకుని వారం రోజులలో గిరిజన ప్రాంతాలలో పర్యటించి గిరిజన సమస్యలను, సంక్షేమ అవసరాలను తెలుసుకుని తదనుగుణంగా చర్యలు ÷ఖసుకుంటానని అన్నారు.

వేగుచుక్క

# జర్నలిస్టులు లేనిది రాజకీయ నాయకులు లేరు.

**జర్నలిస్టులకు వెల్నెస్ ఆసుపత్రి ఉచిత ఐడి కార్డ్ల ఆవిష్కరణ.**










- త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు
- ప్రజాస్వామ్య వ్యవస్థలో పాత్రికేయుల పాత్ర కీలకం.
- టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్.
- ఘనంగా ప్రెస్ క్లబ్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం మహోత్సవం.

" జర్నలిస్టులు లేనిది రాజకీయ నాయకులు లేరనీ, జర్నలిస్టుల చిరకాల వాంఛ అయిన ఇళ్ల స్థలాల విషయమై జిల్లా కలెక్టర్ అధికారులతో ప్రత్యేక సమావేశమై త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పాత్రికేయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. పత్రికా రంగానికి ఎంతో ప్రత్యేక ప్రాధాన్యత ఉందని అన్నారు. ప్రజా సమ స్యలను ప్రభు త్వానికి రాజకీయ నాయకుల దృష్టికి తీసుకెళ్లే వారధి మీడియా నేనని బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని అన్నారు. జర్నలిస్టులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని జర్నలిస్టుల సమ స్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. సోమ వారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బస్వా గార్డెన్ లో ప్రెస్ క్లబ్ నూత న కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం అంగ రంగ వైభవంగా జరుపుకున్నా రు. ఈ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహో త్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీ టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహా దారులు మొహమ్మద్ షబ్బీర్ అలీ , రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ,అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ, తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహే ర్ బిన్ హుందా న్,నగర మేయర్ కూరగాయల ఉమారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పాగంగారెడ్డి, వేలే నెస్ ఆస్పత్రి ఎండీ అసద్ ఖాన్, వెల్నెస్ ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ వెంకట్ రెడ్డి రాజకీ య నాయకులు ప్రముఖులు ము ఖ్య అతి థులుగా హాజ రయ్యారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ కమిటీ నూతన కార్యవర్గం ముఖ్య అతిథు లను శాలువాతో ఘనంగా సన్మానించారు. టిపిసిసి అధ్యక్షుల చేతుల మీదుగా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ నూతన కమిటీ నూతన కార్యవ ర్గాన్ని ముఖ్య అతిథులు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రెస్ క్లబ్ పూర్వ అధ్యక్షులను ముఖ్య అతిథులు శాలువాతో ఘనంగా సన్మానించారు."






**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

జర్నలిస్టులో లేనిది రాజకీయ నాయకులు లేరనే సూక్తి నేను నమ్ము తానని టిపిసిసి అధ్యక్షు లు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నా రాజ కీయ మార్గంలో ఎందరో జర్నలిస్టులు నాకు ఎంతో సహకారం అందిం చారని ఈ సందర్భంగా తెలిపారు. భారత రాజ్యాంగ ప్రకారం జర్నలిస్టులు ఫోర్త్ పిల్లర్ అని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పాత్రికేయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న విషయాలను ప్రజలకు నిజాయితీగా తెలియజేసే బాధ్యత మీడియాపై ఉందని, ప్రజల సమస్యలను పాలకులకు చేరవేయడంలో జర్నలిస్టులు కీలక వంతు పోషిస్తున్నారని అన్నారు. నిజామాబాద్ ప్రెస్ క్లబ్ కొత్త కమిటీ జర్నలిస్టుల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

టిపిసిసి నాయకుడిగా కాదు జర్న లిస్టులకు సోదరిడిగా నేను ఉంటానని అన్నారు. జర్నలిస్టుల కష్టాల్లో పాలు పంచుకుంటానని అన్నా రు. ప్రతిరోజు వివిధ పేప ర్లు చదివితేనే ఎంతో తృప్తిగా ఉంటుందన్నారు. రాష్ట్రంలోనే జర్నలి స్టుల ను ఆదుకోవాల్సిన అవస రం ఎంతైనా ఉందన్నా రూ. జర్నలిస్టుల వృత్తి ఎంతో గొప్పది అన్నారు. రాజకీయాలు కొంతవరకు కలుషితమైతుందినే మాట వాస్తవమే. రాజకీ యాల్లో మంచి చేసే వారిని ప్రోత్సహించండనీ తెలి పారు. జర్నలిస్టుల సమ స్యల పరిష్కారానికి నేను ఎల్లప్పుడూ అండగా ఉంటానని బొమ్మ మహేష్ అన్నారు.

**రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ...**

జర్నలిస్ట్ లు ఎదుర్కొంటున్న ఇళ్ల స్థలాల సమస్య హోసింగ్ సొసైటీ ద్వారా నామినల్ ప్రైస్తో ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు.అతి త్వరలోనే వారి సమస్యను పరిష్కరిస్తామన్నారు. టీపీసీసీ చీఫ్, స్థానిక ఎమ్మెల్యేలు సూర్యనారాయణ, భూపతిరెడ్డి మేమందరం కలిసి దశ దిశా నిర్దేశం చేసి సమస్య పరిష్కరిస్తామన్నారు.

రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి మాట్లాడుతూ...

జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇళ్ల స్థలాల సమస్య కొత్తదేమి కాదని రూరల్ నియోజకవర్గంలో స్థలం చూసి ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల అప్పాజెప్పే బాధ్యత తీసుకుంటామన్నారు.కాంగ్రెస్ పార్టీ జర్నలిస్టులకు అండగా ఉంటుందన్నారు.

**అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ..**

మీడియా ప్రజల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే వారధి అని వారి సమస్యలు పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. జర్నలిస్ట్ ల న్యాయమైన సమస్య ఇళ్ల స్థలాల గత టిఆర్ఎస్ హయాంలో మాట తప్పారని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వారికి వెంటనే ఇల్లాస్థలాలు ఇవ్వాలని కోరారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. వెల్ నెస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇవ్వడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా నిజామాబాద్ నగర మేయర్ కూరగాయల ఉమారాణి మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

**జర్నలిస్టులకు వెల్నెస్ ఆసుపత్రి ఉచిత ఐడి కార్డ్ ల ఆవిష్కరణ.**

వెన్నెల ఆస్పత్రిలో జర్నలిస్టులకు ఉచితంగా వైద్యం అందించేలా రూపొందించిన వెల్లే ఆసుపత్రి ఐడి కార్డు లకు సంబంధించి వెల్నెస్ ఆసుపత్రి కార్యక్రమాన్ని ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు.

జర్నలిస్టులకు అండగా మేముంటామని వెల్నెస్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ అసద్ ఖాన్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వెంకటరెడ్డి తెలిపారు. నిజామాబాద్ ప్రెస్ క్లబ్ జనరేషన్ పూర్తి గా ఉచిత వైద్యం అంది స్తామని ఈ సందర్భంగా తెలిపారు. జర్నలిస్టుకే కాకుండా వారి కుటుం బానికి కూడా పూర్తిగా ఉచిత వైద్యం వెల్నెస్ ఆసుపత్రి నుండి అందిస్తాం అని హామీ ఇచ్చారు.

ప్రమాణ స్వీకారం చేసిన నూతన కమిటీ. అధ్యక్షులు పంచరెడ్డి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి డా॥ వాగ్మారే సుభాష్, కోశాధికారి రాజ్ కుమార్,

ఆర్గనైజింగ్ సెక్ర టరీ బి.రాజు, ఉపాధ్యక్షులు బైసా సంగీత,సతీష్ గౌడ్, గోవిందరాజు, సంయుక్త దకార్యదర్శి రవీందర్ నాయ క్, ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు సితారే కృష్ణ, పబ్బ భూమేష్, ఆడెపు నరేంద్ర స్వామి, జి.భాస్కర్ గౌడ్, సందీప్ దేశ్ ముఖ్, కొట్టూరు సుదర్శన్, రవి చరణ్ రెడ్డి, తాళ్ళ శ్రీధర్, ప్రీతం రెడ్డి, ఆడెపు శ్రీనివాస్, సిఎస్ జయపాల్, కొక్కు రవి
, టిపిసిసి ప్రధాన కార్యదర్శి రాంభూ పాల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా, నగర అధ్య క్షులు నగేష్ రెడ్డి, బొబ్బిలి రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, కాటిపల్లి నరేందర్ రెడ్డి, ఖుద్దూస్, వివిధ పార్టీల నాయకులు, జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.






# సల్మాన్‌కు జోడీగా నయనతార

దక్షిణాదిన అగ్రస్థానంలో ఉన్న కథానాయిక ఎవరంటే.. 'నయనతార' అని టక్కున చెప్పేస్తారు. పారితోషికం పరంగా కూడా నయనే నంబర్ వన్. ప్రస్తుతం ఆ భాష, ఈ భాష అని లేకుండా, అన్ని భాషల్లోనూ సినిమాలు చేస్తూ సత్తా చాటుతున్నది నయనతార. మెగాస్టార్‌తో ఆమె రీసెంట్ హిట్ 'మన శంకర వరప్రసాద్‌గారు' టాలీవుడ్ రీజనల్ సినిమాల్లో నంబర్‌వన్ హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం బాలకృష్ణ 'ఎన్‌బికె 111'లో కథానాయికగా నటిస్తున్నది నయనతార. ఇక తమిళంలో అయితే.. ఆమె చేతిలో చాలా సినిమాలున్నాయి. ఇదిలావుంటే.. రీసెంట్‌గా ఓ బాలీవుడ్ సినిమాకు నయన్ సైన్ చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్‌ఖాన్ హీరోగా రూపొందనున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి టాలీవుడ్ డైరెక్టర్ పైడిపల్లి వంశీ దర్శకుడు. దిల్‌రాజు నిర్మిస్తారట. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానున్నది. ఇక నయన్ నటించిన తమిళ చిత్రం 'ముక్తీ అమ్మన్' సమ్మర్‌లో విడుదల ÷ూనుంది.



# చిత్ర పరిశ్రమలో ట్రోల్స్ పెద్ద పదం

ఇప్పుడిప్పుడే అలవాటు పడుతున్నా విమర్శల నుంచి నేను చాలా నేర్చుకున్నానంటోంది హీరోయిన్ ప్రియాంక అరుళ్ మోహన్. 'మేడ్ ఇన్ కొరియా' సినిమాతో త్వరలోనే వీక్షకులందరికీ కొరియా సంస్కృతిని పరిచయం చేసే తమిళ అమ్మాయిగా ఓటీటీలో సందడి చేయనుంది. ఈ సందర్భంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె సామాజిక మాధ్యమాల్లో తనపై వస్తున్న ట్రోల్స్ గురించి స్పందించింది. 'సోషల్ మీడియాలో 'ట్రోల్స్' అనేది చాలా పెద్ద పదం. గతం గురించి ఆలోచించడం నాకు ఇష్టం లేదు. కానీ, ఇది చిత్రపరిశ్రమ. అనిశ్చితమైన పరిస్థితులు ఎదురవుతాయి. ఇక్కడ ఎవరికైనా ఏదైనా జరగొచ్చు. నేను దాని నుంచే చాలా నేర్చుకున్నాను. సహజంగానే ట్రోల్స్ బాధించినా ఎదగడానికి తోడ్పడతాయి. కొన్నిసార్లు మీరు పడిపోతేనే పైకి రావడానికి అలాంటివి సహాయపడతాయి. నేను ఇలాంటి ప్రతికూల పరిస్థితులను సానుకూలంగా మార్చుకుంటూ కెరీర్‌ని ముందుకు తీసుకెళ్లాలనుకుంను' అని చెప్పింది. గతంలో ప్రియాంక తనపై కొందరు ఉద్దేశపూర్వకంగానే ట్రోల్స్ చేస్తున్నట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే.


# త్రిషకు పార్తీబన్ క్షమాపణలు



ఇటీవల చెన్నైలో జరిగిన ఓ ఈవెంట్‌లో త్రిషను ఉద్దేశించి నటుడు, దర్శకుడు పార్తిబన్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. దీనిపై త్రిష కూడా పరోక్షంగా స్పందించడంతో ఆయన మరో పోస్ట్ పెట్టారు. ఈ విషయంలో జరిగినదంతా తప్పుగా భావించారు. ఇప్పుడు నాకు పశ్చాత్తాపపడటం తప్ప మరో మార్గం లేదఅని తన పోస్ట్‌లో రాశారు. దీంతో ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పడినట్లు అయింది.అసలేం జరిగిందంటే.. గత కొన్ని రోజులుగా త్రిష ప్రేమకు సంబంధించిన రూమర్స్ వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె కోలీవుడ్ అగ్ర కథానాయకుడు విజయ్‌తో కలిసి ఓ వివాహ వేడుకకు హాజరుకావడం ఆ వార్తలకు మరింత బలం చేకూరింది. ఓ ఈవెంట్‌లో త్రిష గురించి పార్తిబన్ మాట్లాడుతూ.. ఆమె కొన్ని రోజులు ఇంట్లోనే ఉండటం మంచిది. ఎందుకంటే ఆమె బయటకు వస్తే ఎక్కడ లేని సమస్యలు వస్తున్నాయని అన్నారు. ఈ వ్యాఖ్యలపై త్రిష పరోక్షంగా స్పందించారు. 'చేతిలో మైక్ ఉంది కదా అని మాట్లాడితే కామెడీ అవ్వదు. అది కేవలం మూర్ఖత్వమే' అని పోస్ట్ పెట్టారు.

# ఉస్తాద్‌కు ఊఎస్‌లో భారీ బుకింగ్స్

## గంటల్లోనే 50 వేల డాలర్లకు పైగా కలెక్షన్లు



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్న మాస్ చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రం ఇప్పటికే భారీ అంచనాలు సృష్టించింది. ఈ సినిమాలో హీరోయిన్లుగా శ్రీలీల, రాశీ ఖన్నా నటిస్తున్నారు. విడుదలకు ముందే ఈ సినిమా పలు రికార్డులను సృష్టించేలా దూసుకెళ్తోంది. ఇటీవల ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా ఈ సినిమాకు మంచి డిమాండ్ ఏర్పడింది. ముఖ్యంగా అమెరికాలోని నార్త్ అమెరికా ప్రాంతంలో 'ఉస్తాద్ భగత్ సింగ్'కు మంచి స్పందన లభిస్తోంది. ఇప్పటికే అక్కడ ప్రీమియర్ షోల బుకింగ్స్ ప్రారంభం కాగా, కొన్ని గంటల్లోనే ఈ సినిమా 50 వేల డాలర్లకు పైగా గ్రాస్ వసూలు చేయడం విశేషం. ఇది కేవలం ప్రారంభం మాత్రమే అని సినీ వర్గాలు భావిస్తున్నాయి. పవన్ కళ్యాణ్‌కు విదేశాల్లో ఉన్న భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ దృష్ట్యా, రాబోయే రోజుల్లో బుకింగ్స్ మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా సినిమా కంటెంట్ బలంగా ఉంటే, నార్త్ అమెరికా మార్కెట్‌లో భారీ వసూళ్లు సాధించే అవకాశముందని అంచనా వేస్తున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకులు దేవి శ్రీ ప్రసాద్, థమన్ సంగీతం అందిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ? హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమా పై అభిమానుల్లో ఇప్పటికే భారీ క్రేజ్ నెలకొంది. మాస్ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. విడుదలకు ముందే ఓవర్సీస్‌లో మంచి బిజినెస్ సాధించడంతో, బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఓజీ చిత్రం తర్వాత పవన్ కళ్యాణ్ నుండి వస్తున్న ఈ సినిమా ప్రభంజనాలు సృష్టించడం ఖాయం అని అంటున్నారు.




# చిన్న పిల్లలపై అత్యాచారాలు అరికట్టాల్సిందే

సరస్వతి సినిమా ప్రమోషన్స్‌లో వరలక్ష్మి శరత్ కుమార్ తెలుగు, తమిళ సినీ పరిశ్రమల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా మంచి గుర్తింపు పొందిన వరలక్ష్మి శరత్ కుమార్ తాజాగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల ఆమె ప్రధాన పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహించిన సరస్వతి సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో చిన్నారులపై జరిగే అత్యాచారాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.చిన్నపిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులు సమాజానికి పెద్ద ప్రమాదంగా మారుతున్నాయని ఆమె అన్నారు. అలాంటి నేరాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 'చిన్న పిల్లలను హరాస్ చేసే వాళ్లను, అత్యాచారం చేసే వాళ్లను అసలు వదిలిపెట్టకూడదు. వాళ్లకు సాధారణంగా మరణశిక్ష ఇవ్వడం సరిపోదు. అలాంటి వాళ్లకు మరింత కఠినమైన శిక్షలు ఉండాలి, కట్ చేసి పడేయాలి' అని వరలక్ష్మి పేర్కొన్నారు.నేను ఎప్పుడైనా ముఖ్యమంత్రి అయితే రేప్ లాంటి నేరాలకు పాల్పడే అబ్బాయిలకు కఠినమైన శిక్ష విధించేలా ప్రత్యేక చట్టం తీసుకువస్తాను. అప్పుడు అలాంటి నేరాలు చేయడానికి కూడా వాళ్లు భయపడతారు. సమాజంలో ఆ భయం రావాలి అని ఆమె అన్నారు. అదే సమయంలో పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు కూడా జాగ్రత్తగా ఉండాలని వరలక్ష్మి సూచించారు. చిన్నారులకు చిన్నప్పటి నుంచే 'గుడ్ టచ్', 'బ్యాడ్ టచ్' గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. పిల్లలకు ధైర్యం ఇవ్వడం, ఏదైనా తప్పు జరిగితే చెప్పేలా వారికి నమ్మకం కల్పించడం ఎంతో ముఖ్యమని ఆమె అభిప్రాయపడ్డారు. ఇక వరలక్ష్మి శరత్‌కుమార్ నటించిన సరస్వతి సినిమా చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడుల నేపథ్యంలో రూపొందిన సామాజిక అంశాలతో కూడిన చిత్రంగా తెరకెక్కింది. ఈ సినిమాతో ఆమె దర్శకురాలిగా కూడా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# సూపర్ మ్యాన్ తరహా స్టోరీతో అల్లు అర్జున్

అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ - మలయాళ దర్శకుడు బసిల్ జోసెఫ్ కలయికలో సినిమా ఎప్పట్నుంచో ప్రచారంలో ఉంది. సూపర్‌మ్యాన్ తరహా కథతో సినిమా తెరకెక్కే అవకాశం ఉన్నట్టు కూడా పరిశ్రమలో చర్చ సాగింది. అయితే అల్లు అర్జున్ వరుసగా తమిళ దర్శకుడు అట్లీ, లోకేశ్ కనగరాజ్‌లతో సినిమాలకు పచ్చజెండా ఊపడంతో, బసిల్ జోసెఫ్‌తో సినిమా గురించి చర్చకు బ్రేక్ పడింది. ఇటీవల జరిగిన అల్లు శిరీష్ పెళ్లి వేడుకకు బసిల్ జోసెఫ్ హాజరు కావడంతో మరోసారి ఆయన, అల్లు అర్జున్ కలయికలో సినిమా తెరపైకొచ్చింది. ఇద్దరూ కలిసి సినిమా చేయడం ఖాయమనే సంకేతాలు వచ్చినట్టైంది. బసిల్ జోసెఫ్ మలయాళంలో కథానాయకుడిగా నటిస్తూనే, దర్శకుడిగా పలు విజయాల్ని అందుకున్నారు.

